# "నాకూ వెన్నెముక ఉంది!"

ఆసం శ్రీనివాసరావు

పంజరం....!

చిలుకకు ఇనుప తీగెలే చెర - పంజర మైతే....

మనసుకు అస్థిపంజరమే శర- పంజరమౌతుంది!

చెరలో సైతం శర పరంపర మొదలైతే.....

బంధం -బంధనం తెంచుకుంటుంది.

పంజర, పటాటోపం - పటాపంచలై పోతుంది.

సరిగ్గా అక్కడే....

ఈ కథానాయకి మహాప్రస్థానం మొదలుపెడుతుంది!!

* * *

మహాప్రస్థానానికన్నా ముందు మరో ప్రస్థానం ఒకటుంది....

ఆ....స్థానమే... ఒక ఆస్థానం! అదే ఈ కథా స్థలం!!

ఎత్తరుగుల వరండా......మధ్యన మెట్లు..... పేరుకుపోయిన సంప్రదాయంలా బలమైన తలుపులున్న వీధి గుమ్మం.... మండువా లోగిలి....... గుండ్రటి స్తంభాలూ..... చుట్టూ నిలువెత్తు ప్రహరీగోడ..... పది బారల పొడవున్న చెక్కగేటు..... అన్నీ కలిపితే ఒక ఆస్థానం!

మాది ఒకానొక క్షత్రియ వంశం! పరిణామ క్రమంలో మధ్య తరగతికి చేరుకున్నా, సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం!

వానరుడు క్రమక్రమంగా నరుడుగా మారితే - క్షాత్రమున్న మా నాన్న మాత్రం దురలవాట్లతో క్షతగాత్రుడయ్యాడు.

నీటి చెలమలోంచి నీరంతా తోడితే - ఇంకేం మిగుల్తుంది? (బొంద ఒక్కటే మిగుల్తుంది)

మాకు మాత్రం ఓ ఇల్లు, నాలుగెకరాల పొలం మిగిలింది! ఇంకా చెప్పాలంటే ఆ మాత్రం పొలాన్నీ ఒక్కో ఎకరం చొప్పున పంచుకుని బయటికి వెళ్లిపోవడానికి -దేశనాయకుల్లా నలుగురం ఆడపిల్లలం మిగిలాం!


మా నాన్న చాలా గొప్ప (?) వాడు! అందుకే, ఆయనకి ఊరంతా ఓ బిరుదిచ్చింది - 'మధుపాన....మదోన్మత్తుడు!'-అని!

సక్రమమైన పాలన లేదేమని ప్రధాన మంత్రినడిగితే - ఇందులో విదేశీ హస్త ముందని సెలవిచ్చినట్టు...... మా నాన్న మందు దాసుడవటానికి 'మస్తు' కారణాలు సెలవిస్తాడు.

అందులో కొన్ని - మా తాతలు నేతులు తాగారట, ఇప్పుడు మా మూతులు ఆ వాసన వేయటం లేదన్న బాధతో తాగుతాడు. నాలుగెకరాలూ తాగుడికీ పోతే నలుగురు కూతుళ్ల పెళ్లిళ్లు ఎలా చేయాలన్న దిగులుతో తాగుతాడు. కిరీటమే పోయిందనుకుంటే - నెత్తిమీద ఉన్న నాలుగు వెంట్రుకలూ ఊడాయన్న మనోవ్యథతో తాగుతాడు. అన్నిటికన్నా పెద్ద కారణమేమిటంటే.....

తాగుబోతునయ్యానే అన్న బాధ తట్టుకోలేక తాగుతాడు! చూశారుగా పాపం, ఆయనలో ఎంత బాధ, వ్యథ దాగి ఉన్నాయో?!

ఇక, అక్కడితో ఆగితే, ఈ కథెందుకు?




ఇంత సొద ఎందుకు?

అయిదు పదుల వయసు దాటినా.... నవ మన్మథుణ్ణే అని ఢంకా భజాయించి మరీ వాదిస్తాడు.

అందుకోసం, అరవయ్యేళ్లు పైబడినా పెళ్లి చేసుకోవచ్చున్న చారిత్రక సత్యాన్నొకదాన్ని ఇప్పటికీ ఉదాహరణగా వదుల్తాడు. అమ్మ ఉండగా మరో పెళ్లి చేసుకోడట! (భారీ సెంటుమెంటు!) కానీ, పెద్ద ఇల్లు ఉండగానే చిన్న ఇల్లు మెయింటైన్ చేస్తాట్ట! (దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెత, ఆయనకి ఆదర్శం మరి!)

ఆయన ఆదర్శాలూ, ఆలోచనలూ....గో టూ పాడుబడ్డ వెల్! వాటికోసం మా జీవితాలు బలి చేయటమే పెద్ద హెల్!

ఈ హెల్ స్టార్టవటమే నా కథకి ఇంటర్వెల్!

* * *

సో, సెకండాఫ్ కొద్దాం....!

నాకప్పుడు పధ్నాలుగేళ్లు! ఊళ్ళోనే ఉన్న హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతూండేదాన్ని! ఇంటిముందు తలదించితే, బళ్లో - అదీ క్లాసు రూమ్‌లో తల ఎత్తాలన్న నియమ నిబంధనలన్నీ, మా బామ్మ నాన్న ద్వారా చెప్పించి స్కూల్‌కి పంపేది. వీలు దొరికినప్పుడల్లా మా బామ్మ అరిగిపోయిన రికార్డుకి మల్లే.... మన వంశ పరువేమిటి, ప్రతిష్టేమిటి, ఆడపిల్లేంటి, దాని బతుకేంటి, చెత్తేంటి, చెదారమేంటి, ముల్లేమిటి, అరిటాకేమిటి ?.... టాంటి పాఠాలు చెప్పి, ప్రశ్నలు వేసి, సంతృప్తికరమైన జవాబులు రాబట్టేది!

బారెడు జడ, అల్చిప్పల్లాంటి కళ్లు నా ప్లస్ పాయింట్లు! అవే అందమైన వాళ్లకి మైనస్ పాయింట్లని ఆవిడ వాదించేది. (క్రిమినల్ లాయరైతే - జడ్జినీ 'దొంగ' అని వాదించగల సమర్థురాలు!).

కళ్లకి కాటుకొద్దు, జడ బారెడు వద్దు..... అని కళ్లకి కాటుక పెట్టకుండా, తలకి పావుశేరు ఆముదం రాసి, జడని బిగుతుగా వేసి, పైకి మడిచి రిబ్బను ముడేసేది.

క్లాసులో అంతా నా వేషాన్ని చూసి.... 'సంస్కృతీ' అన్న నిక్‌నేమ్ పెట్టున్నారని చెప్పినా వదిలేది కాదు.

అదంతా బాల్యం! బాల్యానికీ యవ్వనానికీ మధ్య వారధి.... మొగ్గని పువ్వుగా మార్చే సారధి - ఒకటుంది! అదే నేను పుష్పవతి నవ్వటం!

కథ రసవత్తరంగా సాగాలంటే చాలా మలుపులు కావాలి. నా కథకి మాత్రం నేను పెద్దదాన్నవ్వటమే పెద్ద మలుపు!

పావడా పోయి పరికిణీ, వోణీ వచ్చిందన్న ఆనందంలో ఉన్న నేను చుట్టూ బలమైన పంజరం బిగుసుకుంటోందని ఏ మాత్రం ఊహించలేకపోయాను.

తేరుకునేసరికి నన్ను స్కూలు మాన్పించారు.

నేను చదువుకుంటానని మొర్రో అంటున్నా వినిపించుకోకుండా-మన ఇళ్లల్లో పెద్ద మనిషయ్యాక ఆడపిల్ల బయటికి వెళ్లటానికి వీల్లేదు..... అని ఖరాఖండీగా చెప్పేశారు.

నా కళ్లముందున్న ఒక్కో కలల పరదా తొలగిపోయింది.

చదువు ఇక సాగదు. అన్న నిజం నాకు మింగుడు పడలేదు. ఏదో చేయాలి. వీళ్లని ఎలాగైనా ఒప్పించాలి!

ఆ 'ఎలాగైనా' అనేది ఎలాగో అర్థం కాలేదు. 'తివిరి ఇసుమున తైలము తీయవచ్చు....గానీ, మా నాన్ననీ బామ్మనీ మార్చలేను. ఈ విషయంలో అమ్మ ప్రేక్షకురాలు. అక్కలు సానుభూతి పరులు. వాళ్లనించి నాకెలాంటి సాయమూ అందదు.

అన్ని దార్లూ మూసుకుపోయినప్పుడు - మిగిలేది గోదారి ఒక్కటే! అదే నాకు రహదారి అనుకున్నాను. ఓ 'అశుభ' ముహూర్తాన గోదాట్లో దూకాను.

పనికిరాని పార్టీ అభ్యర్థిని ప్రధాన అధ్యక్షుడు ఏరి పారేసినట్టు - గోదారీ నన్ను ఒడ్డుకు విసిరేసింది. స్పృహలో లేని నన్ను జాలర్లు గుర్తుపట్టి ఇంట్లో అప్పజెప్పారట!

ఆ రాత్రి-

భీతావహ భయానకమైన రౌద్రమూ, క్రౌర్యమూ - అన్నీ మా ఇంట్లో తాండవించాయి. మూడో ప్రపంచ యుద్ధం కూడా ఇంతకన్నా శాంతియుతంగానే జరుగుతుందని మృదంగం వాయించి మరీ చెప్పగలను! సో, గోదారి రాదారి కాదు - నా పాలిట మహమ్మారి!

* * *

నాన్న కొడితే అమ్మ అక్కున చేర్చుకున్నట్టు....పగలు బాధపడితే రాత్రి తన ఒడిలోకి తీసుకుని లాలించి, బుజ్జగించి, జోలపాడి నిద్రపుచ్చుతుంది. కానీ, నాకు మాత్రం రాత్రి, పగలు నాన్నే! నిద్రరాదు... తిండి సయించదు... ఏ ఆలోచనా ఉండదు.

బుర్రని తొలిచే ఆలోచన ఒక్కటే! నేను బాగా చదువుకోవాలి. పెద్ద

ఆఫీసర్నవ్వాలి. ఆడదంటే నాలుగు గోడల మధ్య బంధింపబడే-మరబొమ్మ కాదని చాటి చెప్పాలి.

ఆడదంటే అయితే పిల్లవాయువవుతుంది. లేదంటే ప్రళయ ఝుంఝూమారుతమవుతుంది. ఉనికిలేని గాలినే బంధించలేనప్పుడు-ఉనికి ఉన్న నన్నెవరూ బంధించలేరు. గాలిని బూరలోకి ఎంతకని నెట్టగలరు? అందుకే నేనో రాత్రి కట్టుబట్టల్తో సర్టిఫికెట్లతో ఇంట్లోంచి బయటపడ్డాను.

* * *

బయటికొచ్చాక అర్థమైంది. బయటికి రావటం ఈజీయే! బతకటమే కష్టం అని!

మా పెద్దనాన్నగారింటికి వెళితే ఆయన అర్థం చేసుకుని నన్ను చదివిస్తారని ఆశ కలిగింది. ఇంకేమీ ఆలోచించలేదు. పెదనాన్న ఇంటికెళ్లాను.

అంతా చెప్పాక, ఆయన చిరునవ్వు నవ్వి, నా భుజం తట్టి బయటికెళ్లారు. ఆయన మా నాన్న కన్నా రెండాకులు ఎక్కువే చదివాడని ఆ తర్వాత అర్థమైంది. ఇంటికి తీసుకువెళ్లారు.

ఆ రాత్రి నాలుగో ప్రపంచ యుద్ధం మొదలైంది. మా నాన్న ఆవేశంగా నా జుట్టు పట్టుకుని జడని కత్తిరించేశాడు. జట్టులేకుండా కళావిహీనంగా ఉంటే నేను బయటికి వెళ్లనని ఆయన భావం!

బారెడు జడ పోయినందుకు ఏడ్చినా - చదువుకోడానికి జుట్టుతో పని లేదని అర్థమై సంతృప్తి పడ్డాను.

ఈసారి - ఎవరికీ దొరకనంత దూరం వెళ్లాలి. పాచి పని చేసయినా చదువుకోవాలి. నేను పైకొస్తే వీళ్లు కిందికి దిగొస్తారు. నాకు తెలుసు. పెద్దరికం నిలుపుకోటానికి ఆవేశాన్ని ప్రదర్శించే ఈ పెద్ద వాళ్లంతా - చిన్న వాళ్లు పెద్ద వాళ్లయిన రోజు పిపీలికాలైపోతారు. కనీసం తలెత్తికూడా చూడలేరు.

ఒక మనిషి ఆశనీ, ఆశయాన్నీ తుంచే హక్కు ఎవరికీ లేదు. అమ్మకూ, నాన్నకూ, సంస్కృతికీ, సమాజానికీ - ఆఖరికి దేవుడిక్కూడా లేదు!

అంతే! వంజర వటాటోవం వటాపంచలైపోయింది.

చిలుక స్వేచ్ఛగా గాల్లోకి ఎగిరింది!

* * *

ఈ కథ ఇక్కడితో ఆపి, ముగింపు చెప్తాను.

సమాజం ఒంటి ఆడదానికి బంధువు కాదు - రాబందువు! తల్లీతండ్రీ ఉంటేనే సెక్యూరిటీ లేని దౌర్భాగ్యపు దుస్థితిలో ఉన్న ఆడపిల్లకు ఎదురయ్యే కష్టాలు అరిగిపోయిన రికార్డుకు మల్లే నేను కొత్తగా వినిపించనక్కరలేదు.

ఆడదంటే అరిటాకూ....అరిటాకులో ఆవకాయ-నంజుకు తినొచ్చు అనుకునే వాళ్లందరికీ బుద్ధి చెప్పాను. దొరికిన పనల్లా చేశాను. డబ్బులు కూడగట్టుకొంటూ, చదువు నెట్టుకుంటూ, ఒంటరితనాన్ని ఈదుకుంటూ, విమర్శల్ని ఆత్మ స్థయిర్యంతో ఎదుర్కొంటూ అవిశ్రాంత పోరాటం సాగించాను.

సంప్రదాయంతో యుద్ధం చేయటమంటే - సంప్రదాయాన్ని ధిక్కరించటం కాదు...! సంస్కృతిని మంటకలవటం కాదు! నేను పవిత్రంగా ఉన్నంతకాలం సంస్కృతికి వచ్చిన ముప్పు ఏమీ లేదని గాఢంగా నమ్ముతున్నాను.

కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది.

గుండె దిటవు చేసుకుంటేనే ముందడుగు పడుతుంది!

నా పరిధిలో నాకు తోచిన పరిష్కారమిదే!

నాకూ వెన్నెముక ఉంది. రెండు కాళ్లున్నాయి. ఓ మెదడుంది. ఒక మనసుంది. అన్నిటికి మించి నాకూ ఓ ఆశయం ఉంది.

అది తీరింది.

* * *

కథలెప్పుడూ చర్విత చరణం కాకూడదు. ఒకసారి జరిగిన కథ భూతకాలంలో కలిసిపోవాలి. వర్తమానం కొత్త కథకి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్తుకు బాట చూపాలి.

నేనదే చేశాను.... ఉన్న నాలుగెకరాలూ నాన్న అమ్మేశాడని తెలిసి లెక్చరర్ ఉద్యోగం ద్వారా నెలకు వచ్చే అయిదు వేల జీతంలోంచి చాలా వరకూ వెనకేసి ఇద్దరి అక్కల పెళ్లి చేశాను.

మూడో అక్క మాత్రం ఒకడుగు ముందుకు వేసింది. తనకు నచ్చిన వాణ్ణి, తనని ప్రేమించిన వాణ్ణి పెళ్లి చేసుకుంది.

ఒక తరం మారింది.... నవతరం ఆరంభమైంది.

యుద్ధం సంధిగా మారింది....సంప్రదాయమూ బతికింది.

చివరికిప్పుడు - అమ్మా, నాన్న, బామ్మ.... నా దగ్గరికి వచ్చేశారు.

ఇప్పుడు మా బామ్మ నాకు బారెడు జడ వేసి - కళ్లకి కాటుక దిద్ది అరిగిపోయిన రికార్డు మార్చి కొత్త రికార్డు వేస్తోంది. అదేమిటంటే -

**"ఆడదంటే అరిటాకనుకున్నాను సుమా! వెర్రిదాన్ని! ముల్లు కూడా నేవ్!"**


# కుంటల కంట కన్నీరొలికించొద్దు!

మనం పట్టణాలలో, పల్లె ప్రాంతాలలో కుంటలు, నీటి మడుగులు, చిత్తడి నేలలు చూస్తుంటాం. కుంటలు, నీటి మడుగులలో నీరు దాదాపు భూమి లెవల్‌కు ఉంటుంది. నీటి అంచున కొన్ని మొక్కలు ఎదిగి క్రమంగా ఆ ప్రాంతం చిత్తడినేలగా మారుతుంది. ప్రతి సంవత్సరం వర్షాలవల్ల కాలువల్లోని నీరు వచ్చి ఆ కుంటల్లో చేరుతుంది. ఆ నీటి వెంట మట్టి కొట్టుకు వచ్చి కుంట అంచున చేరిపోతుంటుంది. ఇలా నీటిలోతు క్రమంగా తగ్గిపోయి చిత్తడి నేలలో కొన్ని రకాల మొక్కలు ఎదుగుతాయి.

ఈ మొక్కలు నీటి ఒరవడిని తగ్గించి, కొట్టుక వచ్చే మట్టిని (సిల్టు) కుంటల అంచులవద్దనే ఆపేస్తాయి. దీనివల్ల ఆ కుంటలో నీరు ఎక్కువ రోజులు నిలువ ఉండగలుగుతుంది. పశువులకు, పక్షులకు నీరు సంవత్సరంలో ఎక్కువ రోజులు లభ్యమవుతుంది. ఈ నీటిపైన కొన్ని ఆల్గే జాతి మొక్కలు తేలుతూ సూర్యరశ్మివల్ల ఆహారం తయారు చేస్తాయి. కొన్ని హైడ్రిల్లా వంటి మొక్కలు నీటిలో మునిగి ఉంటాయి. మరికొన్ని కలువ, తామర వంటి మొక్కల వేళ్లు నీటి అడుగున భూమిలో స్థిరపడి పత్రాలు నీటిపై తేలుతూ వుంటాయి. కుంటల అంచుల వెంట తుంగ వంటి మొక్కలు ఎదుగుతాయి. ఈ మొక్కలవల్ల నీటికొంగలవంటి పక్షులకు ఆహారమేగాక గూళ్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా కలుగుతుంది. ఇదేగాక చేపలకు,కప్పలకు, పీతలకు,మిడతలకు తదితర కీటకాలకు అనువైన పరిసరాలు ఏర్పడతాయి. కీటకాలు జీవమున్న మొక్కలనేగాక, మృతి చెందిన మొక్కలనుకూడా తిని జీవిస్తాయి. ఈ కీటకాలు, చేపలకు, కప్పలకు ఆహారం అవుతాయి. ఈ కప్పలు, చేపలు, పాములకు, పక్షులకు ఆహారమవుతాయి. నీటి కొంగలవంటి పక్షులు కీటకాలను తింటూ కీటకాల సంఖ్యను అదుపు చేస్తూ వాటివల్ల పంటలకు కలిగే నష్టాన్ని నివారిస్తాయి.

ఈ నీటి మడుగులు పక్షులకు ఆహారం, గూటి వసతి ఇవ్వడమేగాక పర్యావరణంలోకూడా ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఇవి ఎక్కువ వర్షాలు పడినప్పుడు వరదనీటిని నిలువ చేస్తూ, ఎక్కువ నీటి ప్రవాహం వల్ల కలిగే నష్టాన్ని నిరోధిస్తాయి. కరువు కాలంలో ఈ నీటి మడుగులలో వుండే నీరు చాలావరకు పశుపక్షాదులకు ఉపయోగపడుతుంది.

పట్టణాలనుండి కొట్టుకు వచ్చే మురుగు నీటిలోని నత్రజని, భాస్వరం వంటి కాలుష్య పదార్థాలను పీల్చుకుని నీటిని కొంత వరకు శుభ్రపరుస్తాయి. పర్యావరణ పరిరక్షణలో ఎంతో ముఖ్య పాత్ర వహిస్తున్న కుంటలను, పనికిరాని భూములుగా భావించి నీటిని తోడేసి వ్యవసాయ భూములుగానో, ఇళ్లస్థలాలుగానో మార్చేస్తున్నారు.



ఇటువంటి యోచనలేని పనులవల్లనే కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్-గోషా మహల్ సమీప బస్తీలలో అర్ధరాత్రి ఉప్పెనలు వచ్చి ఎన్నో ఇళ్లు కూలిపోయి ధన,ప్రాణ నష్టాలు జరిగాయి. గోషా మహల్ స్టేడియం వంటి విశాలమైన ఖాళీస్థలం లేని పక్షంలో జరిగే నష్టం ఊహించలేం. పట్టణాలలోని మురుగు నీరు, ఫాక్టరీలనుండి వచ్చే శుభ్రపరచని నీరు, పంట పొలాలనుండి కొట్టుకు వచ్చే రసాయన పదార్థాలు కలసిన నీరు తరచుగా ఇటువంటి నీటి కుంటల్లోకి చేరుతుంది. ఈ కుంటల అంచున వుండే మొక్కలు కొంతవరకు మాత్రమే కాలుష్యాన్ని నివారించగలుగుతాయి. వీటికి శక్తికి మించిన పరిమాణంలో వచ్చే మురుగునీటిలోని నత్రజని, భాస్వరంవంటి పదార్థాలు, పొలాలపై చల్లే డి.డి.టి. వంటి రసాయన పదార్థాలు కుంటల్లోకి చేరుతాయి. దానివల్ల అక్కడ జీవించే మొక్కలకు, జంతువులకు కాలుష్యపు వాత పడుతుంది. కప్పలు, చేపలు,డిడిటి వల్ల చనిపోవటం,వీటిని తిని కొంగలు చనిపోవడం జరుగుతుంది. దానివల్ల అక్కడి పరిసరాలు మారిపోతాయి. కాబట్టి కుంటలు, చిత్తడినేలలను కాపాడే బాధ్యత అందరిపై వుందని గ్రహించాలి. విదేశాల్లో వీటి ప్రాముఖ్యత గురించి ఎంతో ప్రచారం చేస్తున్నారు.

-ఒ.మురళీధర్‌రావు